నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
5 | నల్లగొండ, మంగళవారం 17 జూన్ 2025 | YADADRI BHUVANAGIRI

## స్పోర్ట్స్‌స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికలు

సూర్యాపేటటౌన్, జూన్ 16: హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, ఆదిలాబాద్, కరీంనగర్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం మండల స్థాయిలో బాలబాలికల ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల శాఖల ఆధ్వర్యంలో నడిచే క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. నాలుగో తరగతిలో ప్రవేశం కోసం సోమవారం 19 వరకు ఎంపిక ప్రారంభమైందన్నారు. ఆసక్తి గల బాలబాలికలు సంబంధిత మండల విద్యాధికారిని సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను http://tgss.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 25న ప్రభుత్వ జూనియర్ కళాశాల సూర్యాపేటలో జిల్లా స్థాయిలో ఎంపిక నిర్వహిస్తారన్నారు. జిల్లా స్థాయిలో హాజరైన బాల బాలికలకు 9 మోటార్ క్వాలిటీ టెస్టులు నిర్వహించి ప్రతిభకనబర్చిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి ఎంపికకు పంపిస్తారన్నారు. విద్యార్థులు 8నుంచి 9 ఏండ్ల మధ్య ఉండాలని, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు.

# ఈసారైనా పూర్తి భరోసా అందేనా..?

## మొదలైన వానకాలం సీజన్ • గత యాసంగి రూ.800 కోట్ల రైతు భరోసా పెండింగ్

- వానకాలం భరోసాకు మరో రూ.1575 కోట్లు అవసరం
- రైతులకు తప్పని ఎదురుచూపులు
- పంట పెట్టుబడుల కోసం రైతన్నల తిప్పలు

*వానకాలం నాట్లు మొదలయ్యే నాటికే రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమచేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల ప్రకటించారు. సోమవారం నుంచే రైతుభరోసా నిధులు విడుదల చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి రైతునేస్తం కార్యక్రమం వేదికగా వెల్లడించారు. 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సీఎం ప్రకటించారు. తొలిరోజు రెండెకరాల వరకు 6,11,838 మంది రైతులకు రూ.356,19,40,839 అందజేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా...ఈ సారైన పూర్తిస్థాయిలో రైతుభరోసా అందుతుందా అన్నది ప్రస్తుతం రైతుల్లో హాట్‌టాపిక్‌గా మారింది. పైగా యాసంగిలో మిగిలిపోయిన రైతుల పరిస్థితి ఏంటన్నది స్పష్టత లేదు. కేసీఆర్ సర్కార్ హయాంలో వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతుందంటే రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమయ్యేది. కానీ, కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటిని నుంచి మూడు సీజన్లు ముగిసినా ఎప్పుడూ పూర్తిస్థాయిలో భరోసా రైతులకు అందింది లేదు. గత యాసంగిలో అట్టహాసంగా ఎకరాకు ఆరు వేల చొప్పన రైతుభరోసా ప్రతి రైతుకు అందించనున్నట్లు ప్రకటించి, నాలుగు ఎకరాల రైతుల వరకు ముగించేశారు. దీంతో మిగతా రైతులకు నేటికీ ఎదురుచూపులు తప్పడం లేదు. ఇక వానకాలం సీజన్ పనులు మొదలైన నేపథ్యంలో ఈ సారైనా పూరిస్థాయిలో అందరి రైతులకు భరోసా నిధులు జమ చేస్తారా? లేదా? అన్న సందేహాలు నెలకొన్నాయి.*

నల్లగొండ ప్రతినిధి, జూన్16 (నమస్తే తెలంగాణ): 'ఈ ఏడాది మార్చి 31 వరకు అర్హులైన ప్రతి రైతుకు ఎకరాకు రూ.6వేల చొప్పున రైతుభరోసా అందించి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి గత జనవరి 26న పైలెట్ గ్రామాల్లో పథకాలను ప్రారంభిస్తూ అట్టహాసంగా ప్రకటించారు. కానీ యాసంగి సీజన్‌లో అప్పటి నుంచి జరిగేందేమిటీ? కేవలం పైలెట్ గ్రామాల్లోని రైతులందరికీ మాత్రమే రైతుభరోసా డబ్బులు అందాయి. మిగతా గ్రామాల్లోని రైతుల్లో సగానికి పైగా ఎదురుచూపులు తప్పలేదు. యాసంగి సీజన్‌లో నాలు గు విడతల్లో కేవలం నాలుగు ఎకరాల విస్తీర్ణం వరకు ఉన్న రైతులకు మాత్రమే రైతుభరోసా డబ్బులు ఖాతాల్లో జమచేశారు. ఆపై విస్తీర్ణం ఉన్న రైతులకు నేటికీ భరోసా డబ్బులు ప్రభుత్వం విడుదల చేయలేదు. వరంగల్ రైతు డిక్లరేషన్, ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ఏడాదికి రూ.15వేల రైతుభరోసా హామీని తుంగలో తొక్కుతూ రూ.12వేలు మాత్రమే ఇస్తానని చేసిన ప్రకటన కూడా ఆచరణకు నోచుకోలేదు. గత వానకాలం సీజన్‌లో అనర్హుల ఏరివేత పేరు తో అభిప్రాయాలు, చర్చలు, సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ మొత్తానికే డబ్బులు ఎగొట్టిన విషయం తెలిసిందే. ఇక యాసంగి నుంచి ఎకరాకు రూ.6వేల మాత్రమే ఇస్తామని చెప్పి, అది కూడా పూర్తి చేయలేదు. సీఎం స్వయంగా బహిరంగ సభ వేదికగా 'రాష్ట్రంలోని సాగుయోగ్యమైన ప్రతి ఎకరాకు మార్చి 31లోగా రైతుభరోసా డబ్బులు పూర్తిగా చెల్లిస్తామని' ఆర్భాటంగా చేసిన ప్రకటనకే దిక్కులేకపోతే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవంగా గత యాసంగిలో ఉమ్మడి జిల్లా రైతులకు సుమారుగా రూ.1575 కోట్ల రైతుభరోసా డబ్బులు అందాల్సి ఉంది. కానీ నాలుగు ఎకరాల వరకే పరిమితం చేయడం వల్ల సుమారు రూ.800 కోట్ల వరకే రైతుల ఖాతాల్లో పడ్డాయి. మిగతా రైతులంతా నేటికీ ఎదురుచూస్తూనే ఉన్నారు.




### ప్రస్తుత సీజన్‌లోనైనా...

ప్రభుత్వ తీరు చూస్తుంటే ఈ సీజన్‌లోనైనా పూర్తిగా ఇస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా కిందటి సీజన్‌తో పాటు ప్రస్తుత వానకాలం కలిపి మొత్తం రూ.2300 కోట్ల రూపాయలు కేటాయిస్తానే ఉమ్మడి జిల్లా రైతులకు పూర్తిస్థాయిలో రైతుభరోసా అందనుంది. కానీ ప్రభుత్వం సమకూరుస్తున్న ఆదాయవనరులను పరిశీలిస్తే గత యాసంగిలో మిగిలిపోయిన రైతు భరోసా ఇస్తారన్న గ్యారంటీ కనిపిస్తలేదని రైతుసంఘం నేతలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక వానకాలం రైతుభరోసాను పూర్తి చేయాలన్న మరిన్ని నిధులు సమీకరణ అవసరమన్న అభిప్రాయలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లా రైతులకు ప్రస్తుతం వానకాలంలోనే రూ.1575 కోట్ల వరకు రైతుభరోసా నిధులు అవసరం అవుతాయన్న అంచనాలు ఉన్నాయి. తాజా గా కొత్త రైతుల నుంచి దరఖాస్తులు కూడా తీసుకుంటున్న నేపథ్యంలో ఈ మొత్తం పెరగవచ్చని తెలుస్తోంది.

### ఉమ్మడి జిల్లాలో 26 లక్షల ఎకరాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతుభరోసా అందాల్సిన భూమి విస్తీర్ణం సుమారు 26లక్షల ఎకరాల వరకు ఉన్నట్లు అంచనా. దీనికి సంబంధించి రైతుల సంఖ్య 11.50లక్షలకు పైచిలుకు ఉన్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. వీరికి సంబంధించి సుమారుగా రూ.1575 కోట్ల వరకు రైతుభరోసాగా ఇవ్వాల్సి ఉంటుందని ప్రాథమిక అంచనా. కేసీఆర్ సర్కార్ హయాంలో చివరి సారిగా 2023 వానకాలంలో రైతుబంధును అమలు చేశారు. అదివరుసగా 11వ సీజన్ రైతుబంధు కావడం విశేషం. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 26లక్షల ఎకరాలకు సంబంధించిన 10.80 లక్షల మంది రైతులకు రూ.1250 కోట్లను పెట్టుబడి సాయంగా అందించారు. అదే ఏడాది ఎన్నికల సమయంలోనూ యాసంగి రైతుబంధు అమలుకు కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం కాగా, కాంగ్రెస్ నేతలు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఇవే డబ్బులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎకరాకు కేసీఆర్ మాదిరిగానే ఆదే రూ.ఐదు వేల చొప్పున తప్పనిసరి పరిస్థితుల్లో ఇచ్చారు. ఆ తర్వాత గత వానకాలం నుంచి ఎకరాకు రూ.7500 చొప్పున రైతుభరోసా ఇస్తామని చెప్పి సర్వేలు, అభిప్రాయ సేకరణలు, చర్చోపచర్చల పేరిట మొత్తానికే ఎగనామం పెట్టిన విషయం తెలిసింది. ఇక యాసంగిలోనైనా పూర్తి స్థాయిలో ఇస్తారనుకుంటే అది కూడా మధ్యలోనే ఆపేశారు. ఇక మళ్లీ ప్రస్తుత వానకాలంలో రైతుభరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సారైనా పూర్తిస్థాయిలో ఇస్తారా? లేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ హయాంలో ఎన్నడూ రైతుబంధు డబ్బుల కోసం ఎదురు చూడాల్సి రాలేదని రైతులు గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చిన నాటి నుంచి పెట్టుబడుల కోసం మళ్లీ వడ్డీ వ్యాపారుల గడపతొక్కాల్సి వస్తుందని, రైతులు మండిపడుతున్నారు.



ఏసీబీ విచారణ సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతు తెలిపేందుకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వచ్చిన నల్లగొండ జిల్లా శాసనమండలి సభ్యుడు ఎంసీ కోటిరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రామచందర్ నాయక్



ఫార్ములా ఈ రేస్ విచారణ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతు తెలిపేందకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వచ్చిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ నాయక్, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య తదితర నాయకులు



ఫార్ములా ఈ రేస్ విచారణ సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతు తెలిపేందకు తుంగతుర్తి నియోజకవర్గ నాయకులతో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌కు వచ్చిన మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదారి కిశోర్ కుమార్ తదితర నాయకులు

## అసాంఘిక శక్తులపై నిరంతరం ఫోకస్

కోదాడ రూరల్, జూన్ 16: కోదాడ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లోని అసాంఘిక శక్తుల కార్యకలపాలపై నిరంతరం దృష్టి సారించి, స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, నేరాలకు పాల్పడే వారు ఎం తటివారైనా కఠిన చర్యలు తీసుకంటామని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం కోదాడ రూరల్ సీఐ కార్యలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా అనంతగిరి మండలకేంద్రంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో రూరల్, అనంతగిరి పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలిగట్టు వద్ద గంజాయి తాగుతున్న సతీష్ (ఖానాపురం), ఎస్‌కే సైదాబాబు(అనంతగిరి), బడేటి వెంకటేశ్(అనంతగిరి), చెవుల శ్రీకాంత్(అనంతగిరి) లను అరెస్టు చేసి వారి నుంచి 1.9 గ్రాముల గంజాయిని, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.47,500 ఉం టుందని తెలిపారు. గంజాయి సరఫరా చేసిన నిందితుడు భానుప్రకాశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కొంతకాలంగా గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించి, వారు చెడు అలవాట్లకు బానిస కాకుండా చూడాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో రూరల్ సీఐ రజితారెడ్డి, అనంతగిరి ఎస్ఐ నవీన్‌కుమార్, సిబ్బంది నిరంజన్, సతీష్, శ్రీను, నరసింహులు పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ప్రజావాణి దరఖాస్తులు తక్షణమే పరిష్కరించాలి

- నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జూన్ 16: ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలులో జాప్యం చేయవద్దని నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, పలు శాఖలపై సమీక్షించి మాట్లాడారు. ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మాత్రమే కాకుండా గ్రామాల్లో ఆశ వర్కర్ల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్ఠికాహార పంపిణీ చేయాలన్నారు. అనారోగ్యంతో ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు ప్రభుత్వ దవాఖానకు వచ్చేలా అవగాహన కల్పించాలని వైద్య అధికారులకు సూచించారు. భవిత కేంద్రాల ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అశోక్ రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, పీడీ శేఖర్‌రెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## ప్రజావాణిలో 102 దరఖాస్తులు

- కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవర్

సూర్యాపేటటౌన్, జూన్ 16: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణిలో 102 దరఖాస్తులు వచ్చాయని వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్డీవో పీడీ వీవీ అప్పారావు, అన్ని శాఖల అధికారులు ఉన్నారు.

## 'బీర్ల' ఇంట్లో ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

### సీపీకి గొంగిడి సునీతామహేందర్ రెడ్డి లేఖ



యాదాద్రి భువనగిరి, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్వగృహంలో రవి అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై విచారణ చేపట్టి, నిజాలను నిగ్గు తేల్చాలని మాజీ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బీర్ల ఐలయ్య నివసిస్తున్న మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రవి ఆత్మహత్య చేసుకున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయని దీనిపై కూడా విచారణ చేపట్టాలని కోరారు. ఈ మేరకు సోమవారం రాచకొండ సీపీ కార్యాలయంలో ఆమె లేఖ అందజేశారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు ఈ ఘటన చోటుచేసుకోగా.. శనివారం ఉదయం ఆలస్యంగా వెలుగులోకి రావడం అనుమానాస్పదంగా ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. రాత్రి 9గంటల సమయంలో రవి ఆత్మహత్యకు పాల్పడగా పోలీసులు రాత్రికి రాత్రే తహసీల్దార్‌తో పంచనామా చేయించి, భువనగిరి ఆస్పత్రికి తరలించాల్సిన అవసరం ఏముందని ఆమె ప్రశ్నించారు. ఆత్మహత్యకు రెండు రోజుల క్రితం రవి తన సొంతూరు సైదాపురంలో ఉన్నాడని, రెండు రోజుల తర్వాత బీర్ల ఐలయ్య ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడి శవమై తేలడం అనుమానాలకు తావిస్తోందని ఆమె పేర్కొన్నారు. రవి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తే ఘటన సమయంలో రవి, ఎమ్మెల్యే ఇంట్లోనే ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. స్థానిక పోలీసులతో కాకుండా కమిషనరేట్ పరిధిలోని ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. లేఖ అందజేసిన వారిలో మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి, కొడె మహేందర్, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

## కేజీబీవీ ప్రారంభమెప్పుడో..?



కేజీబీవీ నూతన భవనం

**ప్రారంభానికి నోచుకోని కొండమల్లేపల్లి కేజీబీవీ నూతన భవనం**

- రూ.3.35 కోట్లతో 10 నెలల క్రితమే నిర్మాణం పూర్తి
- కోట్ల రూపాయాలు వెచ్చించినా విద్యార్థినులకు తప్పనితిప్పలు

కొండమల్లేపల్లి, జూన్ 16: అన్ని ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా మండల పరిధిలో నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం దుస్థితి. కోట్ల రూపాయాలు వెచ్చించి నిర్మించిన కేజీబీవీ భవన నిర్మాణం పూర్తయి దాదాపు 10 నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఏడాదిలో పూర్తి కావాల్సిన కేజీబీవీ భవనం పూర్తి చేసుకోవడానికి నాలుగేండ్లు పట్టగా.. నిర్మాణం పూర్తి చేసుకొని 10 నెలలు గడుస్తున్నా ప్రారంభించి వినియోగంలోకి తేవడానికి మాత్రం అధికారులు వెనుకంజ వేస్తున్నారు. నిర్మాణం పూర్తయిందన్న సంతోషం ఒకవైపు... రేకుల షెడ్డులో తాము పడ్డుతున్న అవస్థలు తీరిపోతాయని అనుకుంటున్న విద్యార్థినుల కల మాత్రం సాకారం కావడం లేదు.



ప్రస్తుతం రేకుల షెడ్డులో నడుస్తున్న కేజీబీవీ పాఠశాల

### అరకొర వసతులు మధ్య రేకుల షెడ్డులో...

దేవరకొండ రోడ్డులోని ఓ ప్రైవేట్ రేకుల షెడ్డులో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు కేజీబీవీ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఆ షెడ్డులో విద్యార్థినులకు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుల మధ్య విద్యను కొనసాగిస్తున్నారు. తరగతికి 40 మంది విద్యార్థినుల చొప్పున ప్రస్తుతం 190 మంది విద్యనభ్యసిస్తున్నారు. అద్దె భవనం, రేకుల షెడ్డు కావడంతో ఏటా ప్రారంభంలో కొందరు విద్యార్థినులు టీసీలు తీసుకెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. బడిలో విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న మాజీ ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి దంపతులు సుమారు రూ.3.50 లక్షలు సొంత నిధులు వెచ్చించి కేజీబీవీ పాఠశాలలో సీసీ కెమెరాలు, విద్యుత్, బెంచీలు, మైక్ సెట్ తదితర వసతులు కల్పించారు. అయినప్పటికీ రేకుల షెడ్డు కావడంతో విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### రూ.3.35 కోట్లతో పనులు

విద్యార్థినుల కష్టాలు తీర్చడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేజీబీవీ పాఠశాల భవనానికి రూ.3.35 కోట్లు మంజూరు చేసి కొల్‌ముంతల్ పహాడ్ పంచాయతీ పరిధిలో 2021లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సహకారంతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొదటి రెండేండ్లు నిర్లక్ష్యంగా పనులు జరగడంతో స్థానిక నాయకులు, విద్యార్థి సంఘాల ఒత్తడితో గతేడాది ఆగస్టు నాటికి నిర్మాణం పూర్తయింది. నిర్మాణం పూర్తయి సుమారు పది నెలలు గడుస్తున్నప్పటికీ ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. భవన నిర్మాణం పూర్తయినప్పటికీ, అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం జరుగుతోందని విద్యార్థినుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఉదాసీనతను వీడి కేజీబీవీ పాఠశాల భవనాన్ని ప్రారంభించి విద్యార్థినుల కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

### కేజీబీవీని వెంటనే ప్రారంభించాలి



కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాఠశాల భవన నిర్మాణానికి రూ.3.35 కోట్ల నిధులు కేటాయించింది. గుత్తేదారుడి నిర్లక్ష్యంతో భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. విద్యార్థి సంఘాలు, ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో గత ఆగస్టులో భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అద్దె భవనంలో అరకొర వసతుల నడుమ విద్యార్థులు అవస్థలు పడుతున్నందున అధికారులు చొరవ తీసుకొని ఈ విద్యా సంవత్సరంలోనైన కేజీబీవీ పాఠశాలను ప్రారంభించి విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలి.

- రమావత్ లక్ష్మణ్‌నాయక్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు